క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దొనకొండ: అల్ప పీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, పల్లెల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.రమాదేవి సూచించారు. దసరా సెలవులకు చిన్నారులు ఇళ్లకు వచ్చి ఉంటారని, తల్లిదండ్రులు, పిల్లలు బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాల ప్రభావంతో మట్టి మిద్దెల్లో ఎవరూ ఉండొద్దని, గ్రామాల్లో ఇప్పటికే దండోరా వేయించామన్నారు. వీఆర్‌ఓలు గ్రామాల్లో తిరుగుతుంటారని, సమస్యలు ఉంటే వారికి తెలియజేయాలని తహసీల్దార్ సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది

పుల్లలచెరువు: ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ వై.పాలెం సహాయ సంచాలకులు డాక్టర్ బాలునాయక్ అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మానేపల్లిలో శుక్రవారం గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పశుపోషకులతో డాక్టర్ బాలునాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ నాగుల్‌మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


ఒక వైపు ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు. వర్షాకాలం కావడంతో చిన్నపాటి ఈదర గాలులు వీచినా పడిపోయేలా ఉందని, ఆ విద్యుత్ స్తంభం తీగలు ఆధారంతో ఒక వైపు ఒరిగి ఉందని చెప్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యుత్ స్తంభం నేలకూలే ప్రమాదం ఉందంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా వారం రోజుల్లో నూతన స్తంభం ఏర్పాటు చేసి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మూలమలుపులో పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా మారిన నేలబావి

కురిచేడు: మండలంలోని పొట్లపాడు బస్టాండ్ వద్ద మూలమలుపులో నేలబావి ఉంది. ఆ బావి చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరిగి ఉన్నాయి. దొనకొండ-కురిచేడు రోడ్డు మార్గంలో నిత్యం చిన్న, పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ నేల బావి వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా లేదు. కొత్త వారికి అక్కడ నేల బావి ఉన్న విషయమే తెలియని పరిస్థితి నెలకొంది. అదుపుతప్పి గతంలో ట్రాక్టర్ ఆ బావిలో పడినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఆ బావి చుట్టూ గోడకట్టడం లేదా ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవటం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ఆ బావికి చుట్టూ నివాస గృహాలు, పడమర వైపు ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు ఆ చుట్టుపక్కల ఆటలాడుకుంటుంటారు. ఇప్పటికైనా అధికారులు ఆ నేల బావిచుట్టూ గోడ కట్టాలని, ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వై.పాలెంలోని మార్కాపురం రోడ్డులో నిలిచిన వర్షం నీరు


ఐనముక్కల బీసీ కాలనీలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు


పుచ్చకాయలపల్లిలో ఇళ్ల ముందు వర్షం నీరు

వై.పాలెం జలమయం

- నీట మునిగిన పంటలు

యర్రగొండపాలెం:

నియోజకవర్గంలో శుక్రవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పట్టణం జలమయమైంది. ఏ వీధి చూసినా తటాకాలుగా కనిపిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఈ వర్షంతో ఉద్యాన పంటలకు కొంతమేర లాభం చేకూరినా పూత, కాయ దశలో ఉన్న పత్తి పంటకు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు తెలిపారు. పొలాల్లో నీరు నిల్వ చేరకుండా బయటకు వెళ్లే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు.

ఐనముక్కలలో నీట మునిగిన ఇళ్లు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వేకువ జాము నుంచి కురుస్తున్న భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. భారీ వర్షంతో ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలతో మండల పరిధిలోని పలు చెరువుల్లో నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఐనముక్కల బీసీ కాలనీలో ప్లాట్ల యజమానులు మట్టి తోలి చదును చేయటంతో గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నీరు వెళ్లే మార్గం లేకపోవటంతో నివాస గృహాల్లోకి నీరు చేరడంతో పలువురు గృహ యజమానులు తీవ్ర అవస్థలు పడ్డారు. తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డిలు ఐనముక్కల బీసీ కాలనీని సందర్శించి నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వెంచర్ల యజమానులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దారవీడు: మండలంలో గురువారం రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. పుచ్చకాయలపల్లి దగ్గర ఎగువ ఉన్న కొండల్లో కురిసిన వర్షానికి గ్రామం రోడ్లపై నీరంతా పారుతూ ఇళ్లలోకి చేరింది. లోతట్టు గ్రామం కావడంతో కొన్ని బజారులు వర్షం నీటితో చుట్టుముట్టింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, పొగాకు, మిరప, కంది, కూరగాయలు తదితర పంటలు నీట మునిగాయి. పంటలను రక్షించడం కోసం పొలంలో నిల్వ ఉన్న వర్షం నీటిని బయటకు పంపించేందుకు రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. నీటిలో పత్తి, పొగాకు, మిరప మొక్కలు మునిగి పోవడంతో చాలా మొక్కలు పక్కకు ఒరిగి పోవడం, ఉరకలెత్తి చనిపోవడంతో భారీగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

ఎగువ ప్రాంతం కొండల్లో వర్షం కురవడంతో నీరంతా నల్లవాగు ద్వారా పెద్దారవీడు చెరువుకు చేరుతోంది. అధికారులు పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇలా..


జలమయమైన ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణం


చెరువుకాదిది.. ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం



వై.పాలెం: బాల త్రిపురసుందరిదేవిగా..


తాళ్లూరు: మహాలక్ష్మీదేవిగా గంగమ్మతల్లి


దర్శి: మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ తల్లి


త్రిపురాంతకం: సింహ వాహనంపై అమ్మవారు


దర్శి: పోలేరమ్మ తల్లి..


దర్శి: దద్దాలమ్మ అమ్మవారు

మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శిలో దేవీనవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో మహాలక్ష్మీదేవి అమ్మవారుగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని రూ.40 లక్షలతో లక్ష్మీదేవిగా అలంకరించారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదన చేశారు. కుంకుమ పూజ, అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. హాజరైన భక్తులందరికీ అన్నదానం చేశారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆలయంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారికి భక్త నీరాజనం

పెద్దదోర్నాల: దసరా నవరాత్రులు పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆశ్వీయుజ శుద్ధ చతుర్థి నాడు పలు దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్త్రనామ పారాయణం నిర్వహించారు. శుక్రవారం వాసవీ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.


దొనకొండ: అన్నదానం

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లె సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శుక్రవారం రాజ్యలక్ష్మి అమ్మవారు సంతాన లక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు భవానిప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తిరుమలనాథస్వామికి, రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌లకు పంచామృతం, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు శ్రీచక్రంకు కుంకుమార్చన పూజలు చేశారు. ఉభయదాతలుగా శ్రీగోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం సభ్యులు వ్యవహరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తాళ్లూరు: దసరా నవరాత్రుల్లో భాగంగా వివిధ ఆలయాల్లో అమ్మవారికి ఐదో రోజు శుక్రవారం వైభవంగా పూజలు చేశారు. తాళ్లూరు, తూర్పుగంగవరంలో వాసవీ కన్యకాపరమేశ్వరులు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారిని ఆలయ పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మిలు శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారిని ధనం, నాణేలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారి, కుంకుమార్చన చేశారు. భక్తులకు అవసరమైన వసతులను ఆలయ ఈఓ జి.వాసు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కె.ప్రసాద్ పర్యవేక్షించారు.

కురిచేడు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం శ్రీజ్ఞానప్రసూనాంబ దేవి భక్తులకు శ్రీ అష్టలక్ష్మిదేవిగా దర్శనమిచ్చింది. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యే పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


పెద్దారవీడు: కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆనంద ఆశ్రమంలో వెలసిన ఈశ్వరీదేవి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి గణపతిపూజ, అమ్మవారి అభిషేకం, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చనలు చేసి శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించి సామూహిక హారతులిచ్చారు. ఐదో రోజు ఈశ్వరీ మహాదేవి శాకాంబరిగా దర్శనమిచ్చారు. గుడిపాడుకు చెందిన గుడిపాటి కోటేశ్వరరావు, సుబ్బులు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. భైరవానంద స్వామి భక్తులకు అన్ని వసతులు కల్పించారు.

యర్రగొండపాలెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం లలితా సహస్త్ర పారాయణం, రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత కొప్పుకొండ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వైభవంగా సింహవాహన సేవ

త్రిపురాంతకం: దసర శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీబాలాత్రిపుర సుందరీదేవి శైలిపుత్ర అలంకారంలో సింహ వాహనంపై వేదపండితుల మంత్రోచ్చరణలతో ఊరేగింపు వైభవంగా జరిగింది. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీ అమ్మవారి ఆలయంలో దసర నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీబాలాత్రిపురసుందరీదేవి శైలిపుత్ర ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి వాహన సేవలు వైభవంగా జరుగుతున్నాయి.

మాజీ ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక పూజలు

యర్రగొండపాలెం: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రోజూ జరిగే నిత్య ధూప, దీప, నైవేద్యం కోసం ఆయన శాశ్వత ఉభయదాతగా సహకరిస్తున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పూజ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు కె.అనంత వెంక సుబ్రహ్మణ్యం, సి.సుబ్రహ్మణ్యం, సి.శ్రీనివాసులు, గ్రంధిశిల సూర్య వెంకట నారాయణ, కె.చిన్న వెంకటేశ్వర్లు, సి.నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు, వై.తిమ్మయ్య, సి.ఆంజనేయులు, పి.నరసింహారావు, జి.వీరవెంకట సుబ్బారావు, ఎం.కిరణ్, పి.కిశోర్, వై.శివప్రసాద్, ఈ.బాలవెంకటేశ్వర్లు, ఈ.భాస్కర్, ఈ.శివకృష్ణ పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

కళకళలాడుతున్న మెట్ట పైర్లు


జీవం పోసుకున్న ఆముదం పైరు


సాగులో ఉన్న పత్తి

దొనకొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది, ఆముదం, పత్తి పంటలకు సకాలంలో వర్షాలు కురవక పోవటంతో ఎండు ముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతో పైర్లు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు అల్ప పీడనం చాలా ఉపయోగ పడిందని, ప్రధానంగా వాణిజ్య పంటలైన ఆముదం, కంది, పత్తి వర్షానికి జీవం పోసుకున్నాయి. ఇప్పటి వరకు పొలాలకు ఎరువులు వేయని రైతులు మన గ్రోమోర్, జనతా రైతు బజారులో ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే మిరప నారు కూడా పెరగడంతో నాట్లు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసి ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అన్ని గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో ఆముదం, 5 వేల ఎకరాల్లో కంది, 8 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు సమాచారం.

సైకో అంటే గుర్తొచ్చేది బాలకృష్ణే

- అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిని దూషించడం దారుణం
- ఎమ్మెల్యే బాలకృష్ణపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు

దర్శి: రాష్ట్రంలో సైకో అంటే ఎవరికైనా గుర్తుకొచ్చేది సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణేనని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే బాలకృష్ణ ఇష్టానుసారం మాట్లాటాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. బలకృష్ణ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఆయా ప్రాంతాల్లో వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ దర్శి, ముండ్లమూరు, దొనకొండ మండలాల కన్వీనర్‌లు వెన్నపూస వెంకటరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణలు బాలకృష్ణ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. అసెంబ్లీలో బాలకృష్ణ సైకోలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. చిరంజీవిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అభిమానులకు ఇంకా గుర్తున్నాయన్నారు. చిరంజీవిని పరుష పదజాలంతో దూషిస్తున్నా ఆయన తమ్ముడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. బాలకృష్ణను సైకో అనేందుకు చాలా ఉదాహరణలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మెగాస్టార్ చిరంజీవికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పోతంపల్లిలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దారవీడు: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ పోతంపల్లిలో చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీన సాక్షి పత్రికలో పల్లెల్లో జ్వరాల కలవరం శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వీధుల్లో తిరిగి మురుగు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డాక్టర్ శంకరరెడ్డి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. 28 మందికి చిరు వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. రోగులకు ఇంజెక్షన్లు, మాత్రలు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని, వ్యక్తిగతంగా శుభ్రంగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. జ్వరాలు సోకిన వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. ప్రతి శుక్రవారం గ్రామంలో డ్రైడే తప్పనిసరిగా పాటించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఎంపీహెచ్‌ఏ భరత్‌భూషణ, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మల్లికార్జున, ఏఎన్‌ఎం అరుణజ్యోతి, ఆశా కార్యకర్తలు నాగమ్మ, వెంకటమ్మ, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శంకరరెడ్డి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ మందా శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి సూచించారు. మండలంలోని బొద్దికూరపాడుపాడులో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్వస్తినారి-స్వశక్తి పరివార్ అభినయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎంపీటీసీ కె.బాలకోటయ్య, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

దర్శి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు, కాన్సర్ వ్యాధిగ్రస్థులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం 5 మండలాల నుంచి వచ్చిన గర్భిణులకు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, వారికి తోడుగా వచ్చిన వారికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం చేశారు. క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ శ్రీవాణి, ఎస్ఐ మురళి, దర్శి మానవత సేవాసంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న మానవత సభ్యులు


మాట్లాడుతున్న సర్పంచ్ మందా శ్యాంసన్